అడవులను తలపిస్తున్న చెరువులు

- కంపచెట్లతో నిండిపోయిన చెరువులు
- గుబురు పొదలతో రూపురేఖలు కోల్పోయిన వైనం
- దెబ్బతింటున్న చెరువు కట్టలు

మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటల్లోకి నీరుచేరే పరిస్థితి కనిపించడం లేదు. చెరువులు మొత్తమ కంపచెట్లతో నిండిపోయాయి. గుబురు పొదలతో వాటి రూపురేఖలు కోల్పోతున్నాయి. అధికారులు తగు చర్యలు చేపట్టకపోతే వర్షపునీరు చెరువుల్లో నిలిచే అవకాశం ఉండదు.



ఏనుగుల చెరువుచెరువులో పెరిగిపోయిన కంపచెట్లు

గుర్రంకొండ : మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 115 చెరువులు, కుంటలు ఉన్నాయి. ఇందులో ఐదు మేజర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. ఈ చెరువులు, కుంటల కింద 8756 ఎకరాలు ఆయుకట్టు విస్తీర్ణం ఉంది. మండలం మొత్తం మీద 12 చెరువుల్లో పెద్ద ఎత్తున కంపచెట్లు, ముళ్లపొదలు నిండిపోయాయి. ప్రస్తుతం చెరువుల్లో పెద్ద ఎత్తున కంపచెట్లు పెరిగిపోయాయి. దీంతో ఇక్కడ చెరువు ఉన్న ఆనవాళ్లే కనిపించడం లేదు. చివరకు చెరువు కట్టల మీద కూడా కంపచెట్లు పెరిగిపోవడంతో కట్టల పరిస్థితి ప్రమాదకరంగా మారుతోంది. వీటితోపాటు ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు ఎక్కువగా పెరిగిపోయాయి. ఎండిపోయిన ముళ్లకంపలు చెరువుల్లో ఎక్కడ పడితే అక్కడ కుప్పలు తెప్పలుగా పడిఉన్నాయి. దీంతో మనుషులు, పశువులుగానీ చెరువుల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వర్షాలు కురిసి వంకలు సాగినా నీరు చెరువుల్లోకి చేరి నిల్వ ఉండే అవకాశం కనిపించడం లేదు. ఏదో కొదిపాటిగా చేరే మొత్తం ఈ కంపచెట్లకే సరిపోతుందనిరైతులు ఆరోపిస్తున్నారు. ఏళ్ల తరబడి వీటి గురించి పట్టించుకోక పోవడంతో చెరువుల రూపరేఖలు మారిపోయాయి. ఒక్కప్పుడు వర్షపునీటితో కళకళలాడే చెరువులు నేడు ముళ్లకంపలు, కంపచెట్లతో దర్శనమిస్తున్నాయి. వర్షాల సీజన్ ప్రారంభమయ్యేలోగా చెరువుల్లో కంపచెట్లను తొలగించే ప్రక్రియ చేపడితే ఎంతో మేలు జరుగుతందని ఆయుకట్టు రైతులు అంటున్నారు. అధికారులు స్పందించాల్సి ఉంది.

పంచాయతీలు	15
చెరువుల సంఖ్య	115
మేజర్ ఇరిగేషన్ చెరువులు	5
ఆయకట్టు విస్తీరణం (ఎకరాల్లో)	8756
కంపచెట్లతో నిండిన చెరువులు	42

ఉపాధి హామీ పథకం వైపు రైతుల చూపు

సమస్య పరిష్కారం కోసం ఉపాధిహామీ పథకం వైపు ఆయుకట్టు రైతులు చూస్తున్నారు. గతంలో ఉపాధిహామీ పథకంలో చెరువుల్లో ముళ్ల కంపల తొలగింపు పనులు జరిగాయి. నాలుగేళ్ల క్రితం ఉపాధిహామీ పనుల్లో భాగంగా చెరువుల్లో ముళ్లకంపలు, కంపచెట్లను తొలగించే పనులు చేశారు. అప్పట్లో పెద్ద ఎత్తున అన్ని చెరువుల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. చెరువుల్లో కంపచెట్లు తొలగించే పనులు మళ్లీ చేపడితే రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆయుకట్టు రైతులు అంటున్నారు.

కంపచెట్లు తొలగించాలి

చెరువుల్లో పేరుకుపోయిన కంపచెట్లు, ముళ్లపోదలు తొలగించాలి. వర్షాలు కురిసిన వర్షపునీరు చేరితే కంపచెట్లు ఉండడం వలన ఎవరికి ఉపయోగకరంగా ఉండదు. వీటిని తొలగిస్తే చెరువుల్లో నీరు నిలవడమేకాకుండా పశువులు, మేకలు, గొర్రెలకు నీటి వసతి లభిస్తుంది. వీటితోపాటు వ్యసాయానికి కుడా చెరువుల నీటిని వినియోగించుకోవడానికి సౌకర్యంగా ఉంటుంది.



- వెంకట్రమణ, మొరంకింద పల్లె

అమృత్ సరోవర్ కింద పనులు చేపడతాం

ఉపాధిహామీ పథకంలో భాగంగా అమృత సరోవర్ పథకం కింద చెరువుల్లో కంపచెట్లను తొలగించే పనులు చేపట్టవచ్చు. ఈ పథకం ఈఏడాది నుంచి ప్రవేశపెట్టారు. గతంలో కొన్నిచెరువులను ఈ పథకం కింద ఎంపిక చేసి ప్రతిపాదనలు పంపించాం. ప్రస్తుతం పనులు కూడా మంజూరుఅ య్యాయి. ఇంకా అవసరమైన చెరువుల్లో కూడా ఈపథకం కింద పనులు చేపడతాం.



- రెడ్డిజవహర్, ఏపీఓ, గుర్రంకొండ

క్లుప్తంగా

రేపు ఉచిత వైద్యశిబిరం

కలికిరి : మండలంలోని పల్లవోలు గ్రామంగడిలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మునిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి రమాదేవి ఆసుపత్రి వైద్య నిపుణులు హాజరై ఎముకలు, న్యూరాలజీ, కిడ్నీ, ఈఎన్‌టీ, ఊపిరితిత్తుల సమస్యలు, ఆయాసం తదితర జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారని పేర్కొన్నారు. పల్లవోలు గ్రామంతో పాటు చట్టుపక్కల ప్రాంతాల ప్రజలు హాజరై ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. అవసరమైన వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు, శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు.

సాహితీమూర్తుల పటాలు అందజేత

మదనపల్లె సిటీ : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీకి మంగళవారం ఆజీబష్లా ఆర్ ట్రస్టు వారు సాహితీమూర్తుల చిత్రపటాలను బహూకరించారు. అంతర్జాతీయ భాషా దినోత్సవం పురస్కరించుకుని సాహితీమూర్తుల చిత్రపటాలను ప్రిన్సిపాల్ కృష్ణవేణికి అందజేశారు. వీటిని కాలేజీ తరగతి గదుల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆజీబష్లా ట్రస్టు వ్యవస్థాపకులు ఎం.ఎ.బాషా, నాగరాజు, అధ్యాపకులు మోహన్‌వల్లి, నమ్రత, మోహన్‌బాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

గుర్రంకొండ: మండలంలోని మర్రిమాకులపల్లె గ్రామానికి చెందిన చిన్నమస్తాన్‌రెడ్డి కుమార్తె హరిత ఇటీవల మృతి చెందింది. మంగళవారం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బాధితుడి ఇంటివెళ్లి వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. హరిత మృతి పట్ల తన ప్రగాఢసానుభూతిని తెలియజేసి ఓదార్చారు.

ఎస్.కుసుమకు డాక్టరేట్



కురబలకోట : మండలంలోని అంగళ్లు వద్ద ఉన్న మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.కుసుమకు తమిళనాడులోని వేలూరు విట్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ మంగళవారం తెలిపారు. సర్వెస్ ఇన్వెస్టిగేషన్స్ ఆన్ ఈసీజీ బేస్డ్ కార్డియో వాస్క్యులర్ డీసీస్ క్లాసిఫికేషన్ యూసింగ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ అంశంపై పరిశోధనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు తెలిపారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ



పాఠశాలలో స్టోర్ గదిని పరిశీలిస్తున్న డీవైఈఓ కృష్ణప్ప

ములకలచెరువు: మండలంలోని దేవులచెరువు ఉన్నతపాఠశాల, మోడల్ స్కూల్‌ను డీవైఈఓ కృష్ణప్ప మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం, గుడ్లు, చిక్కిల స్టాక్‌కు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వండిపెట్టాలని చెప్పారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ఎంఈఓ వెంకటరమణ ఆయనతో పాటు ఉన్నారు.

పీవీసీ పాఠశాలకు జాతీయ హరిత అవార్డు



అవార్డు అందుకుంటున్న టీచర్ రవీంద్రరెడ్డి

వాల్మీకిపురం: ఏపీ నేషనల్ గ్రీన్ కోర్, సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని ఇండియన్ హ్యాబిటట్ సెంటర్‌లో జరిగిన హరిత పాఠశాలల సంస్థ డైరెక్టర్ జనవరల్ సునీత నరైన్ నుంచి వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ పాఠశాల నుంచి గ్రీన్ టీచర్ రవీంద్రరెడ్డి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీసీ డైరెక్టర్ స్రవంతి, రాష్ట్ర కోఆర్డినేటర్ నీలకంఠయ్య, జిల్లా కోఆర్డినేటర్ చక్రధర్ రాజులు పాఠశాల హెచ్‌ఎం అమరనాథ రెడ్డి, గ్రీన్ టీచర్ రవీంద్రారెడ్డిని అభినందించారు.

ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ

తంబళ్లపల్లె : పదో తరగతి ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకే ప్రభుత్వం స్కిల్‌హబ్ సెంటర్ల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు డీఎస్‌డీఓ హరిక్రిష్ణ తెలిపారు. స్థానిక టీఎన్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో స్కిల్‌హబ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. 28 మంది విద్యార్థులకు అసిస్టెంట్ ఎలక్ట్రీసియన్ ట్రేడ్‌లో ట్రైనర్ శ్రీమన్నారాయణరెడ్డి మూడు నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి అయిన వారికి మంగళవారం ఐటీఐలో అర్హత పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు రూపొందిన ప్రయోగాలను ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. ఈ పరీక్షలకు 27 మంది హాజరై అందరూ అర్హత సాధించారు. బుధవారం ప్రభుత్వ ఐటీఐలో శిక్షణ పూర్తి చేసిన వారికి జాబ్‌మేళా నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

నేడు గృహసారథులకు అవగాహన

కేవీపల్లె : మండలంలోని గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు 'మా నమ్మకం నీవే జగన్' నినాదంపై బుధవారం అగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. సాయంత్రం 3 గంటలకు కేవీపల్లె ఎస్సీ బాలుర వసతిగృహం ఆవరణలో ఎమ్మె ల్యే చింతల రామచంద్రారెడ్డి అధ్యక్షతన అవగాహన సమావేశం జరుగుతుందని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అభ్యంతరాలు తెలియజేయవచ్చు

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం బొమ్మనచెరువు పంచాయతీ లాభాల గంగమ్మదేవాలయం దేవదాయశాఖ పరిధిలో చేర్చు విషయంపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. 15 రోజులలోపు లేఖద్వారా గానీ, స్వయంగా వచ్చి తెలియజేయవచ్చునని తెలిపారు.

కవితా పోటీలు

మదనపల్లె సిటీ: మరసం (మదనపల్లె రచయితల సంఘం) 27వ వార్షికోత్సవం పురస్కరించుకుని కవితా పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి లింగాల యుగంధరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. యువ కవులు, కళాభిమానులను తమ కవితలను మార్చి 5లోపు మరసం కార్యాలయం, బెంగళూరు రోడ్డు, మదనపల్లె అనే చిరునామాకు పంపాలన్నారు. వార్షికోత్సవం రోజున నాట్యం, గానం, ఏకపాత్రాభినయం పోటీల్లో పాల్గొనవచ్చునని తెలిపారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



స్వామివారి ఆభరణాలు, వెండి పాత్రలను శుద్ధి చేస్తున్న దృశ్యం

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కోయిళ్ ఆళ్వార్ తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది స్వామివారి బ్రహ్మోత్సవాలకు ఆరు రోజులు ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం అంటే ఆలయాన్ని సుగంధ ద్రవ్యాలతో శుద్ధి చేయడం, స్వామివారి ఆయుధాలను, ఆభరణాలు, వెండిపాత్రలన్నింటిని పలురకాల ద్రవ్యాలతో శుద్ధి చేస్తారు. ఈనేపథ్యంలో మంగళవారం ఆలయంలో వేకువజామునే తోమాలసేవ, స్వామివారికి అర్చన మొదటి గంట నిర్వహించారు. టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో అర్చకులు, సిబ్బంది కలసి ముందుగా భక్తిశ్రద్ధలతో సుగంధ ద్రవ్యాలతో కూడిన మిశ్రమ పదార్థాంతో ఆలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం స్వామివారి ఆభరణాలు, వెండి పాత్రలను సుగంధ ద్రవ్యాలతో శుభ్రం చేశారు. దీంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ కావించేనట్లేనని అర్థం. ఈ సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి స్వామివారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయఅర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీటీడీ ఇన్స్‌పెక్టర్ మోహన్‌రావ్, అర్చకులు కృష్ణ, అనిల్, గోకుల్‌స్వాములు పాల్గొన్నారు.

వైభవంగా మల్లేశ్వరస్వామి తిరునాల

పెద్దమండ్యం : మండలంలోని గుర్రంవాండ్లపల్లె పంచాయతీ బత్తినగారిపల్లెలో మల్లేశ్వరస్వామి తిరునాల సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. నిర్వాహకులు బత్తినగారి వీరభద్రస్వామి ఆలయం వద్ద భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి స్వామివారి కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లెలో ఊరేగించారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. చెక్క భజన, బాణాసంచా ఎంతో ఆకట్టుకుంది. తిరునాలకు చుట్టూ గ్రామాల నుంచి భక్తులు, ప్రజలు తరలివచ్చారు. రాష్ట్ర బీసీ సెల్ కన్వీనర్ గుర్రం రమేష్, ఎంపీటీసీ సభ్యులు బోడెం రవితేజ, వైఎస్సార్‌సీపీ నాయకులు బోనాల మధు, కేశవ, రెడ్డెప్పరెడ్డిలు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

'ఉపాధి'లో అవకతవకలకు చోటివ్వకూడదు



ఉపాధి సిబ్బందిని విచారిస్తున్న అడిషినల్ పీడీ రవి కుమార్

కలికిరి : ఉపాధి హామీ పథకంలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలని అడిషిల్ పీడీ రవికుమార్ అన్నారు. మంగళవారం కలికిరి సీఎల్ఆర్‌సీ భవనంలో సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీలలో 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు ఉపాధి హామీ, ఉపాధి హామీ ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, సోషల్ ఫారెస్ట్, ఫారెస్ట్ శాఖలకు సంబంధించి రూ.7.88 కోట్ల నిధులతో జరిగిన 978 పనుల వివరాలను ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు సామాజిక తనిఖీ ఎస్‌ఆర్‌పీ కన్నారెడ్డి ఆధ్వర్యంలో ఏడుగురు డీఆర్‌పీలు తనిఖీలు నిర్వహించారు. తనిఖీ సిబ్బంది నివేదికల ఆధారంగా ఉపాధి సిబ్బందిని విచారించిన అడిషినల్ పీడీ వివిధ పనులకు సంబంధించి రూ.36,373 నగదు రికవరీ, అపరాధ రుసుము వసూలుకు ఆదేశించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ మధుబాబు, ఎంపీడీఓ గంగయ్య, డీవీఓ ప్రకాష్, ఏపీఓ సుజాత, టీఏలు, ఈసీలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

సూక్ష్మనీటి సాగుపథకంతో నీరు ఆదా



రైతులకు డ్రిప్ పరికరాలపై సలహాలు ఇస్తున్న అధికారులు

రామసముద్రం : సూక్ష్మనీటి సాగుపథకంతో నీటిని ఆదా చేయవచ్చని ఏపీఎంఐపీ రాష్ట్ర ఓఎస్డీ టెక్నికల్ వెంకటేశ్వర్లు, జిల్లా సూక్ష్మసేద్య అధికారి వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. మంగళవారం రామసముద్రం మండలం కనగాని, కుదురుచీమనపల్లె, అరికెల గ్రామాల్లో 2022–23 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రాయితీ ద్వారా మంజూరు చేసి రైతుల పొలాలను పరిశీలించారు. అలాగే రాయితీపై మంజూరై అమర్చిన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కలిగే ఉపయోగాలను, ఎరువుల యాజమాన్యం చేయు విధానాలపై రైతులకు తగు సూచనలు, సలహాలు తెలియజేశారు. కొత్తగా డ్రిప్ పరికరాలు ఏర్పాటు చేసుకోవాలనుకునే రైతులు ఐదుఎ కరాలలోపు ఉంటే 90 శాతం రాయితీ, ఐదు నుంచి పది ఎకరాల మధ్యలో ఉన్న రైతులకు 70 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలను 15 రోజుల్లోపు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మదనపల్లె హార్టికల్చర్ ఆఫీసర్ ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి, ఎంఐడీసీ హరినారాయణ, ఎంఐఈ కృష్ణనాయక్, ఎంఐఏఓ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి తీవ్రగాయాలు

మదనపల్లె : గుడికి వెళ్లి తిరిగివస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో భవన నిర్మాణ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మదనపల్లె మండలంలో మంగళవారం రాత్రి జరిగింది. గొల్లపల్లెకు చెందిన లక్ష్మన్న కుమారుడు వై.సురేష్ బాబు (36) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతడు మద్యానికి బానిస కావడంతో భార్య సుశీల ఎలాగైనా మద్యం మాన్పించేందుకు సీటీఎం గంగమ్మ గుడిలో ప్రమాణం చేసి దారం కట్టించాల్సిందిగా బంధువు సుబ్బును కోరింది. సురేష్‌బాబు, సుబ్బు ఇద్దరూ కలిసి మంగళవారం సాయంత్రం నలవీర గంగాభవాని ఆలయానికి చేరుకుని పూజారితో చేతికి దారం కట్టించుకున్నారు. అనంతరం సుబ్బు ఇంటికి వచ్చేయగా సురేష్‌బాబు రాత్రి ఇంటికి బయలుదేరి వస్తుండగా శ్రీనివాస కల్యాణ మండపం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో కుడి కన్ను, తలకు తీవ్రగాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

చేనేత సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా కె.రాజేంద్ర

కలకడ : జిల్లా చేనేత సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడిగా కలకడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన కూటాల రాజేంద్రను ఎంపిక చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుర్ర వెంకట్రమణ తెలిపారు. మంగళవారం మండలంలోని కలకడ శ్రీచౌడేశ్వరిదేవి ఆలయం సమీపంలో జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని నియామకపత్రం అందజేశారు. పీలేరు నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడిగా కెవిపల్లె మండలంకు చెందిన గుంపు జయరాంను, నియోజకవర్గ ప్రచార కార్యదర్శిగా కలకడ మండలం కె.బాటవారిపల్లెకు చెందిన శ్రీనాథ్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

జగనన్న నమ్మకాన్ని నిలుపుకుందాం

- చంద్రబాబు వైఫల్యాలను ఎండగట్టాలి
- ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి తీసుకెళ్లాలి
- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వలంటీరు, గృహసారథుల వ్యవస్థపై ఎంతో నమ్మకంతో ఉన్నారు. సీఎం నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కలికిరిలో ఆర్‌ఎస్ఆర్ కల్యాణ మండపంలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని వలంటీర్లు, గృహసారథులు, సచివాలయాల కన్వీనర్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఏ పథకాలు కావాలన్నా జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకుంటేనే జరిగేవన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు కనపడకుండా తొలగించిన ఘనత చంద్రబాబుకు దక్కిందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎటువంటి సిఫారసులు లేకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికి నేరుగా సంక్షేమ లబ్ధి చేకూరుతోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్ళి, ప్రజా మద్దతు పుస్తకంలో వివరాలు నమోదు చేయాలన్నారు. మార్చి 18 నుంచి 26వ తేదీ వరకు ఎనిమిది రోజులు వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీతోనే మైనారిటీలకు సముచిత స్థానం

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలకు సముచిత స్థానం సాధ్యమైందని రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ అన్నారు. నియోజకవర్గంలో ఎంపీ పీవీ మిథున్ రెడ్డి చొరవతో మసీదులు, దర్గాల అభివృద్ధికి రూ.50లక్షలకు పైగా ఎంపీ లాడ్స్ కేటాయించారన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు సహదేవరెడ్డి, మండల కన్వీనర్ చింతల రమేష్ రెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, సచివాలయాల మండల కన్వీనర్ రెడ్డెప్ప, సర్పంచ్‌లు ఆర్.వెంకటరెడ్డి, గంగయ్య, బేబి ఆయేషా, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్ రెడ్డి, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి వారధులు గృహసారథులే

గుర్రంకొండ : ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాల్సిన బాధ్యత గృహసారథులపై ఉందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక గోల్డెన్ ప్లాజా కల్యాణ మండపంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలన్ని ప్రతి కుటుంబానికి అందించే బాధ్యత గృహసారథులు, సచివాలయ కన్వీనర్లపై ఉందన్నారు. ప్రతి కుటుంబానికి నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను తెలియజేయాలన్నారు. పార్టీలకతీతంగా టీడీపీ వారికి కూడా ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ అన్న నినాదాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేసి పార్టీని అధికారంలోకి మళ్లీ తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రవినాయక్, మండల సచివాలయల కన్వీనర్ చింతిర్ల నాగేంద్ర, జెడ్పీటీసీ సమీన్ ముక్తియార్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటశివారెడ్డి, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ కరుణాకర్, రెడ్డెమ్మ కొండ చైర్మన్ నరసింహారెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, ఎల్వి రమణ, మాజీ ఎంపీపీ నక్కాచంద్రశేఖర్, ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'పది'లో మంచి ఫలితాలు సాధించాలి

మదనపల్లె సిటీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీవైఈఓ క్రిష్ణప్ప అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం 18 మండలాల మ్యాథ్స్, ఇంగ్లీషు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలన్నారు. వారికి బిట్‌బ్యాంకు ద్వారా సులభంగా నేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, కోర్సు డైరెక్టర్ రెడ్డన్నశెట్టి, సిఆర్‌పీలు చంద్రశేఖర్, మోహన్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్థ ఆదాయం పెంచేందుకు కృషి

మదనపల్లె సిటీ: ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలని డిపో–1 మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం డిపో ఆవరణంలో సిబ్బందితో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రికి ప్రత్యేక సర్వీసులు నడపడం వల్ల రూ.16,27,000 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అందరి సమష్టి కృషితో ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

డీఎస్పీ కేశప్ప



విద్యాసామగ్రి అందజేస్తున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె సిటీ: విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదవడం వల్ల జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని డీఎస్పీ కేశప్ప అన్నారు. స్థానిక బెంగళూరు రోడ్డులోని జీఆర్‌టీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా వారి కష్టాన్ని గుర్తుంచుకుని ఉపాధ్యాయుల సూచనల మేరకు బాగా చదువుకుని మంచి పేరు తేవాలని సూచించారు. వన్‌టౌన్ ఎస్.ఐ హరిహర ప్రసాద్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయరులు తేజస్విని, హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై అవగాహన కల్పించండి

మదనపల్లె : సైబర్ నేరాలు, యాంటీడ్రగ్స్, దిశా యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎస్పీ కేశప్ప అన్నారు. మంగళవారం పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సచివాలయ మహిళా సంరక్షణ పోలీసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ కేశప్ప మాట్లాడుతూ..సైబర్ క్రైమ్, రహదారి ప్రమాదాలపై ప్రతి మహిళా పోలీస్ ప్రజల్లోకి వెళ్లి చైతన్యపరచాలన్నారు. మహిళలు ఏమైనా సమస్యలు ఎదుర్కొంటుంటే వాటిని అధికారుల దృష్టికి తీసుకురావడం, పరిష్కారం దిశగా బాధితులకు సహకారం అందించాలన్నారు. వేసవికాలం దృష్ట్యా లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంపై ప్రజలకు వివరించి, వినియోగించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో ఎస్ఐ హరిహరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాష మాధుర్యం మరువలేనిది

పీలేరు : మాతృభాష మాధుర్యం మరువలేనిదని తెలుగు భాషా సమితి అధ్యక్షుడు జలకనూరి మురళీధర్‌రాజు అన్నారు. మంగళవారం స్థానిక వీఎస్ఎన్ సిద్ధార్థ పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాష పరిరక్షణలో భాగంగా బంగ్లాదేశీయులు (అప్పటి తూర్పు పాకిస్తానీయులు) చేసిన భాషా ఉద్యమానికి నివాళిగా యునెస్కో 1999 ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృ భాషా దినముగా ప్రకటించినట్లు తెలిపారు. మాతృభాష మానవ మనుగడకు మూలాధారమన్నారు. అనంతరం తెలుగు పద్యాలు, కవితలతో అలరించారు. అంతకుమునుపు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మాధవి, అధ్యాపకులు బాలాంజనేయులు, సురేష్, సీఆర్‌పీ నాగరాజ, తెలుగు ఉపాధ్యాయులు చలపతినాయుడు, బాబు, సురేంద్ర, శైలజ, మురళీ, ప్రేమ, సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



మాట్లాడుతున్న జలకనూరి మురళీధర్‌రాజు



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి

వాల్మీకిపురం: మనిషి మనగడ సాధించాలంటే మాతృభాష కీలకమని స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ క్రిష్ణమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే స్థానిక ఉర్దూ అకాడమీ గ్రంథాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఉద్దేశించి జవాద్ హుస్సేన్ మాట్లాడుతూ దేశంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అనేక రాష్ట్రాలు, అనేక ప్రాంతీయ భాషలు ఉన్నప్పటికీ ఉర్దూ కూడా ఒక గొప్పభాష అన్నారు. సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్, డాక్టర్ అల్మా ఇక్బాల్ మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ తదితరులు ఉర్దూ భాష కోసం చేసిన సేవలను ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, గ్రంథాలయ సిబ్బంది జాహెద్, ఫైరోజ్, మండల కోఆప్షన్ సభ్యులు మహబూబ్‌బాషా, విశ్రాంత ఉద్యోగులు అమీర్ హుస్సేన్, మౌలాన అబ్దుల్ వలి, అబ్దుల్ గఫూర్, సాధిక్, షాహెద్, సుఫియాన్, మత పెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.